కథ

# సమాధి మందిరం

- బి.వి. భద్రగిరీష్

విజయవాడ స్టేషనుల్లో ఆగిన గౌహతి - ఎర్నాకుళం ఎక్స్‌ప్రెస్‌లోంచి ప్లాట్‌ఫారం మీదకి దిగాడు కిషోర్. అతడి పర్సనాలిటీ, వంటిపై ఉన్న యూనిఫారం అతడు మిలటరీలో పని చేస్తున్నాడని చెప్పకనే చెబుతున్నాయి. అతడి వెనకాలే దిగారు భార్యా, పిల్లలూ. వారి వెనకనే మిలటరీ వాళ్లు మాత్రమే వాడే నల్లని ఇనుపపెట్టె మరియు ఇతర సామాన్లు మోసుకుంటూ కూలీలు దిగారు. చుట్టూ చూశాడు కిషోర్. అతడి కళ్ళు తండ్రి కోసం వెతుకుతున్నాయి. దూరం నుంచి చెయ్యి ఊపుకుంటూ అతడి దగ్గరకు వచ్చారు కిషోర్ తండ్రి అయిన వెంకట్రామయ్య. "ప్రయాణం బాగా జరిగిందా? ఎలా వున్నావు?" అని కొడుకునుద్దేశించి అడిగాడు. "ఏమ్మా బాగున్నావా?" కోడలిని ప్రశ్నించాడు. మనవలిద్దరి తలలపై చేయివేసి ప్రేమగా నిమిరాడు.

"వెళదామా నాన్నా?" ప్రశ్నించాడు కిషోర్.

"పద, పద, టాక్సీ మాట్లాడుకునే వచ్చాను. త్వరగా ఇంటికి చేరాలి. ఇవాళ అర్ధరాత్రే కద నీ ఇంటి గృహ ప్రవేశ ముహూర్తం. అయినా నువ్వు కట్టుకొన్న కొత్త ఇంట్లోకి గృహప్రవేశం చేయడానికి నువ్వే ఇలా ఆఖరు నిమిషంలో వస్తే ఎలారా? నీకంటే ముందే బంధువులంతా వచ్చారు. ముందే రాలేక పోయావా?"

"బార్డరులో డ్యూటీ కద నాన్నా! లాంగ్‌లీవు అనేసరికి, నాకు ప్రతిగా ఇంకొకరు రావాలి. అన్నీ తెములుచ్చుకొని వచ్చేసరికి ఈ టైము అయింది. సరేగానీ, ఇల్లు పూర్తయిందా, ఇంకా పనేమైనా మిగిలుందా నాన్నా?"

"అంతా పూర్తయినట్టే, కరెంటు, నీళ్ళ కనెక్షన్లు కూడా వచ్చేశాయి. గృహ ప్రవేశం చేయడమే తరువాయి. ఫర్నీచరు షిఫ్ట్ చేసుకొని కొత్త ఇంట్లో ఉండవచ్చు. మొత్తానికి ఈ వయసులో నామీద పెద్దభారమే పెట్టావురా. ఇంటిపనుల గురించి తిరగలేక చచ్చాననుకో. సమయానికి నీకు డబ్బు సర్దుబాటు అవుతుందో, కాదో.... ఇల్లు పూర్తవుతుందో లేదో అని భయపడ్డాను. సమయానికి అవసరమైనంత డబ్బు నువ్వు పంపడం వల్లే ఇల్లు త్వరగా పూర్తయింది. అయినా అడిగినప్పుడల్లా డబ్బు ఎలా సర్దుబాటు చేయగలిగేవురా?"

"లోన్ పెట్టాను నాన్నా! దానికితోడు ఈ మధ్య రావలసిన ఎలవెన్సుల ఎరియర్స్ వచ్చాయి. అందుకే సమయానికి డబ్బు సర్దుబాటు చేయగలిగాను. అవునూ, బంధువులందరినీ పిలిచినట్టేనా! కేశవాచారిని కూడా పిలిచావా నాన్నా". మాట మార్చుతూ అడిగాడు కిషోర్.

ఒక్కక్షణం తడబడ్డాడు వెంకట్రామయ్య. వెంటనే తమాయించుకుని "ఆ! అందరినీ పిలిచాను" అన్నాడు ముక్తసరిగా. ఇంతలో టాక్సీ సత్యనారాయణపురంలోని వాళ్ళ ఇల్లు చేరింది.

విజయవాడలో ఇటీవల అభివృద్ధి చెందుతున్న గొల్లపూడి ప్రాంతంలో తనకోసం కట్టుకున్న ఆకర్షణీయమైన భవంతిలోకి ఆ రోజు రాత్రి గృహప్రవేశం చేశాడు కిషోర్. తాను చేసిన సూచనల మేరకు, తన అభిరుచులకు తగ్గట్టుగా ఇంటిని కట్టించినందుకు తండ్రికి ధన్యవాదాలు తెలియజేశాడు. ఇల్లు నచ్చిందని భార్య కళ్లతోనే చేసిన ప్రశంసని గర్వంగా అందుకున్నాడు. మరుసటిరోజు పొద్దున సత్యనారాయణ వ్రతం. ఈలోగా బంధువుల పలకరింపులు, అభినందనలు, మర్యాదలు, ఉద్యోగధర్మం గురించి ఆరాలు... కిషోర్‌కి ఊపిరి సలపలేదు. సాయంత్రానికి సద్దుమణిగింది. విశ్రాంతిగా కూర్చొని తండ్రితో పిచ్చాపాటి మాట్లాడుతుండగా, హఠాత్తుగా గుర్తుకు వచ్చిందతడికి, గృహప్రవేశానికి తన బాల్యమిత్రుడు కేశవాచారి రాలేదని, "కేశవాచారి వచ్చినట్టు లేడే? మీరతన్ని పిలిచారుగా?" అని అడిగాడు.

అప్పటిదాకా తనతో విషయాలు ముచ్చటిస్తున్న తల్లీ, తండ్రి ఒక్కసారిగా మౌనం వహించడం చూసి విస్తుపోయాడు.

గాంభీర్యం వహించిన తండ్రి ముఖంలోకి పట్టిపట్టి చూస్తూ "ఏమైంది నాన్నా? కేశవ రాలేదెందుకని?" అడిగాడు. "అదీ... అదీ..." వెంకట్రామయ్య నీళ్ళు నమలసాగాడు.

"నాన్చడం దేనికండీ! ఎప్పటికైనా వాడికి తెలియాల్సిందిగా... చెప్పండీ?" మాట చివర్లో తల్లి గొంతు గద్గదమవడం చూసి మరింత విస్తుపోయాడు.

"ఏమైంది నాన్నా కేశవకి, వంట్లో బాగోలేదా?" అడిగాడు కిషోర్.

"అదికాదురా, కేశవ.... కేశవ.... చనిపోయాడు" మెల్లగా చెప్పాడు వెంకట్రామయ్య.

ఉలిక్కిపడ్డాడు కిషోర్. "ఏమిటి, కేశవ చనిపోయాడా? ఎలా? యాక్సిడెంట్లోనా? ఎప్పుడు చనిపోయాడు? నాకెందుకు చెప్పలేదు?" ప్రశ్నల వర్షం కురిపించాడు.

"చనిపోయి రెండు నెలలైందటరా. నాకు కూడా ఈ మధ్యే తెలిసింది. నేను నీ ఇంటిపనిలో పడి బయటవిషయాలు పట్టించుకోలేదు. తెలిసిన వాళ్ళు చెప్పారు. శుభకార్యం కోసం వస్తున్నావు కదా, నువ్వు బాధ పడతావని చెప్పలేదు. గృహప్రవేశం అయ్యాక చెప్పచ్చులే అని ఆగాను".

"ఎలా చనిపోయాడు యాక్సిడెంటా, వంట్లో

బాగోలేకనా?''.

ఈసారి సమాధానం చెప్పడానికి వెంకట్రామయ్య మరింత తడబడ్డాడు. కాసేపు ఆగి నెమ్మదిగా చెప్పాడు. ''కేశవ ఆత్మహత్య చేసుకున్నాడటరా...''

అదిరిపడ్డాడు కిషోర్.

''... ఏవో ఆర్థిక ఇబ్బందులు వచ్చాయట... తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నాడట... అతని చావువార్త చెప్పినతను చెప్పాడు...'' వెంకట్రామయ్య చెబుతూనే ఉన్నాడు.

కుర్చీలో వెనక్కివాలి బాధగా కళ్ళు మూసుకున్నాడు కిషోర్. కళ్ళముందు కేశవాచారి రూపం మెదిలింది. బక్కపలచగా, బిడియంగా ఉండేవాడు. కిషోర్ మనసులో కేశవాచారి తాలూకు జ్ఞాపకాలు. 'కేశవాచారి... తన బాల్యమిత్రుడు. వాళ్ళ ఊరు కొండపల్లి. వాళ్ళది తరతరాలుగా కొండపల్లి బొమ్మలు చేసే కుటుంబం. కేశవాచారి కూడా బొమ్మలు చెక్కేవాడు. పదోక్లాసు దాకా తన క్లాసుమేటు. పదో తరగతి తర్వాత అతడు చదువు ఆపేసి తరతరాలుగా వస్తున్న వృత్తిని చేపట్టాడు. తాను చదువు కొనసాగించాడు. శారీరక సౌష్టవం ఉండడం వల్ల బోర్డరు సెక్యూరిటీ ఫోర్సులో ఉద్యోగం వచ్చింది. మంచి పనితనంతో బొమ్మలు చేసేవాడు కేశవాచారి. దారులు వేరైనా తమ స్నేహం కొనసాగింది. తాను సెలవు మీద విజయవాడ వచ్చినప్పుడల్లా వచ్చి కలిసేవాడు. అటువంటి కేశవాచారి ఇవాళ... ఆత్మహత్య... కంటోన్మెంట్లో తనపై అధికారికి మాటల సందర్భంగా కొండపల్లి బొమ్మల గురించి చెబితే ఆయన వాటిని తీసుకురమ్మని కోరాడు. కేశవాచారి దగ్గర మంచి బొమ్మలు తీసుకొని పై అధికారిని మెప్పించాలని కూడా తాను అనుకొన్నాడు. ఇంతలో ఇదేమిటి?' కళ్ళు తెరిచి ''వాళ్ళ కుటుంబం ఎక్కడుంది? కొండపల్లిలోనే ఉందా?'' ఆత్రంగా అడిగాడు.

''తెలీదురా! ఆ వివరాలు తెలియలేదు. నేను కొండపల్లి వెళ్ళి వద్దామనుకొన్నాను కానీ, కుదర్లేదు''. ఇంతలో కిషోర్ తల్లి కల్పించుకుంది. ''బాధపడకురా కిషోర్! విషయం తెలియగానే మేమూ చాలా బాధపడ్డాం. కానీ మనమేం చేయగలం. అతడి తలరాత అలావుంది. లేచి ముఖం కడుక్కొని రా, భోజనం చేద్దువు గాని!'' అనునయంగా అన్నది.


''నేను రేపు కొండపల్లి వెళ్ళి వస్తాను'' . తన నిర్ణయాన్ని వినిపించి లేచాడు కిషోర్.

కొండపల్లి ఊర్లో బస్సు దిగి, కేశవాచారి వాళ్ళ ఇంటివైపు నడిచాడు కిషోర్. పూర్వం ఆ వీధిలో కొండపల్లి బొమ్మలు తయారుచేసి అమ్మే షాపులు చాలా వుండేవి. ఇప్పుడవేవీ లేవు. కొన్ని ఇళ్ళయ్యాయి. మరికొన్ని మామూలు షాపుల కింద మారిపోయాయి. ఒకటి రెండు మద్యం అమ్మే బెల్టుషాపులు కూడా కనిపించాయి. కేశవాచారి ఇంటికి వెళ్ళి వాకబుచేస్తే తెలిసిందేమంటే, అతడి కుటుంబం అక్కడ లేదు. వివరాలడిగితే, ఆ ఇంట్లో ఉంటున్నవారు, తమకు తెలియదని చెప్పారు. 'ఎక్కడికి వెళ్ళి ఉంటారు? కేశవ భార్య బహుశ తన పుట్టింటికి వెళ్ళిందేమో. ఆమెది తిరువూరు దగ్గరనుకుంటా, సరిగ్గా గుర్తులేదు. ఏదైనా కొండపల్లి బొమ్మలు అమ్మేషాపులో అడిగితే తెలుస్తుందేమో!' ఆలోచన వచ్చింది కిషోర్‌కు. బొమ్మలు అమ్మేషాపులు పట్టుకోగలిగాడు. లోపలికి వెళ్ళాడు. షాపు చాలాపాతగా ఉంది. షోకేసుల్లో బొమ్మలున్నాయి గాని దుమ్ముకొట్టుకుపోయి ఉన్నాయి. ఒకటి రెండు షోకేసుల అద్దాలు పగిలిపోయి ఉన్నాయి. కౌంటరు దగ్గర పంచె కట్టుకొని, బనీను వేసుకొని ఒక ముసలాయన కూర్చొని ఉన్నాడు. కిషోర్ అతని దగ్గరకు వెళ్ళి ''ఇక్కడ కేశవాచారి అని ఒకతను ఉండాలి.... రెండు నెలల క్రితం...''

''కేశవాచారి ఎందుకు తెలీదు బాబూ, పాపం ఆత్మహత్య చేసుకున్నాడుగా, ఎందుకు అతని గురించి అడుగుతున్నావు?''

''అతను నా స్నేహితుడండి, వాళ్ళ కుటుంబం ఇప్పుడు ఎక్కడ ఉంది?''

''అతను చనిపోయిన తరువాత అతడి భార్య పిల్లలను తీసుకొని పుట్టింటికి వెళ్ళి



పోయింది. తిరువూరు దగ్గర గోపవరం.''

తన ఊహే నిజమైందనుకున్నాడు కిషోర్. ''కేశవ ఆత్మహత్య ఎందుకు చేసుకున్నాడో మీకేమైనా తెలుసా?''

''ఎందుకేమిటి బాబూ. బతుకు సాగక. బొమ్మల వ్యాపారం పడిపోయింది. అందరూ ప్లాస్టిక్ బొమ్మలే కొంటున్నారు. దానితో మా వ్యాపారం సగం పడిపోయింది. దశావతారాలు, లక్క పిడతలు, దేవతల బొమ్మలు



తయారుచేసి అమ్ముకొని జీవనం సాగిస్తున్నాం. మేము తయారుచేసిన దేవతల బొమ్మలకి బాగానే గిరాకీ ఉండేది. కానీ ఇప్పుడు చైనా దేశం వాళ్ళు మన దేవతల బొమ్మల్ని అచ్చం మా బొమ్మల్ని పోలినట్లు గానే తయారు చేస్తున్నారటగా! వాటి ధర కూడా చాలా చవకగా ఉన్నదటగా! మాకు చెక్క దొరికే ధరకు వాళ్ళు బొమ్మలు ఎలా అమ్మగలుగుతున్నారో?''

చైనా పేరు వినగానే ఛెళ్ళున చరిచినట్లు ఫీలయ్యాడు కిషోర్.

ముసలాయన నోటివెంట కేశవాచారి పేరు వినిపించి అటు చూశాడు.

''ఎవరో ఒక పెద్దాయన ఎక్కువ మొత్తంలో బొమ్మలు కొంటానని కేశవాచారికి మాట ఇచ్చాడట. ఆయన మాట నమ్మి అక్కడా ఇక్కడా అప్పు తెచ్చి పెట్టుబడిపెట్టి బొమ్మలు చేశాడు. ఇంతలో చైనా తయారీ బొమ్మలు వచ్చి పడ్డాయి. అవి చవకగా ఉండడంతో ఆ పెద్దాయన చక్కా అవి పట్టుకు పోయాడట. చేసిన బొమ్మలు అమ్ముడవక, అప్పులు తీర్చలేక అభిమానం కలవాడు కావడంతో ఆత్మహత్య చేసుకున్నాడు. మాలాంటి వాళ్ళం చావడానికి ధైర్యం లేక, చేతిలోని వృత్తిని వదులుకోలేక ఇదిగో ఇలా ఉన్నాం...'' ముసలాయన చెబుతూనే ఉన్నాడు. గిరుక్కున వెనక్కు తిరిగి షాపులోంచి బయటకు వచ్చేశాడు కిషోర్.

తిరుగు ప్రయాణంలో, బస్సులో కూర్చొని వున్న కిషోర్ చెవులలో ముసలాయన మాటలే గింగురుమంటున్నాయి. ''చైనాలో తయారైన బొమ్మలు అంత తక్కువ ధరకు ఎలా అమ్మగలుగుతున్నారో?'' ఆ ప్రశ్నకు సమాధానం అతడికి తెలుసు.

'తాను ప్రస్తుతం డ్యూటీలో ఉన్నది అరుణాచల్‌ప్రదేశ్ రాష్ట్రంలో చైనా సరిహద్దు ప్రాంతంలోని తవాంగ్ వద్ద నున్న చెక్‌పోస్టులో. ఆ ప్రాంతంలోని సరిహద్దు గుండా అరుణాచల్‌ప్రదేశ్ ద్వారా దేశంలోకి చైనాలో తయారైన రకరకాల వస్తువులు స్మగ్లింగ్ అవుతుంటాయి. ఎక్కువగా ఎలక్ట్రానిక్స్ వస్తువులు, ప్లాస్టిక్ వస్తువులు, దుస్తులు మొదలైనవి. ఈ స్మగ్లింగును ఆపవలసిన బాధ్యత సరిహద్దు కాపలా సైనికులుగా తమదే. అయితే చూసీచూడనట్టు వదిలేయడం వల్ల తనవాటా తనకు దక్కుతోంది. నెలకు పాతిక వేలదాకా అదనపు ఆదాయం ముడుతోంది. స్మగ్లింగు అయ్యే వాటిలో డ్రగ్స్, విధ్వంసకర వస్తువులు లేకుండా చూసుకుంటే చాలు. ఈ పై ఆదాయం వల్లే విజయవాడ లోని ఖరీదైన ప్రాంతంలో తాను కోరుకున్నట్లు అందమైన ఇంటిని కట్టుకోగలిగాడు. ఇంటి నిర్మాణం కోసం అవసరమైనప్పుడల్లా తండ్రికి డబ్బు పంప గలిగాడు. సరిహద్దులో తన నిర్వాకం వల్ల ఎవరికీ నష్టం లేదనుకున్నాడు ఇన్నిరోజులూ. కానీ తాను చేస్తున్న తప్పుడు పని కేశవాచారి లాంటి వాళ్ళ మరణానికి కారణమవుతుందనుకోలేదు. చైనాలోని ఆర్థిక పరిస్థితుల వల్ల అక్కడ వస్తువులు చవకగా తయారవుతాయి. ఆ వస్తువులు ఎలాంటి పన్నులూ చెల్లించకుండా దేశంలోకి దిగుమతి అయితే చవకగా ఉండకుండా ఎలాఉంటాయి? కేశవచారి మరణానికి తాను ప్రత్యక్షంగా కారణం కాకపోవచ్చు. తాను కాకపోతే తనలాంటి వాడు మరొకడు....' దగ్గరకొచ్చే కొద్దీ, తనకు కట్టుకున్న కొత్త ఇల్లు కేశవాచారిలాంటి వాళ్ళ శరీరాలపై కట్టిన సమాధి మందిరంలా కనబడసాగింది కిషోర్‌కి.

*

చిరునామా:
బి.వి.భద్రగిరీష్,
ప్లాటు నెం.28, మొదటి అంతస్థు,
కె.పి.నగర్, బెంజి సర్కిల్ దగ్గర, విజయవాడ-08
సెల్: 99121 56560